

ప్లాస్టిక్ నిషేధం అమలుకు 8 బృందాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ప్లాస్టిక్ నిషేధం పకడ్బందీగా అమలు చేసేందుకు ఎనిమిది బృందాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ నాయుడు తెలిపారు. ఈ మేరకు చేపట్టబోయే విధివిధానాలపై నగరపాలక సంస్థ కార్యాలయంలో సమీక్ష చేపట్టారు. ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఇప్పటి వరకు ప్రజల్లో, వర్తకుల్లో అవగాహన, చైతన్యాన్ని కల్పించామన్నారు. అయినా అనేకచోట్ల ప్లాస్టిక్ వినియోగం సాధారణంగా ఉంటున్న పరిస్థితుల్లో నిఘాను పెంచేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కొన్ని నియంత్రణ చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మధుసూదన్ రావు, ఇఇ శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి మేనేజర్ మూర్తి, టిపిఆర్ఒ సింహాచలం పాల్గొన్నారు.

పార్వతీపురం మండలం ములగలో నూర్పిడి చేసి విక్రయానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం

ఓ వైపు కొలిక్కిరాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు.. మరోవైపు నత్తనడకన గృహ నిర్మాణం.. ఇంకోవైపు సంక్షేమ హాస్టళ్లలో సమస్యల తిష్ట.. ఇలా చెప్పుకుంటూ పోతే ఆ రంగం, ఈ రంగం.. అనే తేడాలేదు. అన్ని రంగాల్లోనూ ప్రజల సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రమాదకర విద్యుత్తు లైన్లు తొలగించాలనే జిల్లా పరిషత్తు సమావేశాల నిర్ణయం ప్రహసనంగా సాగుతోంది. మెటీరియల్ కాంపొనెంట్ పనులు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారన్న అభియోగాలు పెరిగాయి. సమగ్ర శిక్ష ఎపిసి అక్రమంగా పోస్టులు భర్తీచేశారన్న ఆరోపణలతోపాటు కలెక్టర్‌కు తప్పుడు సమాచారాలు, నివేదికలు అందజేశారన్న అభియోగాలు ఉన్నాయి. ప్రారంభం నుంచే పంటల బీమాపై 100శాతం పూర్తి చేసినట్టు నివేదిక చూపించడంతో రైతులు, ప్రజాప్రతినిధుల్లో అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇలా చాలా సమస్యలు పేరుకుపోవడంతో నేటి జిల్లా పరిషత్తు సమావేశంలోనైనా చర్చకు వచ్చేనా? అన్నట్టుగా జనం చర్చించుకుంటున్నారు.

కొలిక్కిరాని ధాన్యం కొనుగోలు

- నత్తనడకన గృహ నిర్మాణం
- సంక్షేమ హాస్టళ్లలో సమస్యల తిష్ట
- ప్రహసనంగా ప్రమాదకర విద్యుత్తు లైన్ల తొలగింపు
- నిబంధనలకు విరుద్ధంగా మెటీరియల్ కాంపొనెంట్ పనులు
- సమగ్ర శిక్ష ఎపిసిపై ఆరోపణలు
- పంటల బీమాపై అనుమానాలు
- నేటి జిల్లా పరిషత్తు సమావేశంలో చర్చకు వచ్చేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. ముఖ్యంగా ఇరు జిల్లాల్లో వరికోతలు ప్రారంభయ్యాయి. కానీ, ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఏర్పాట్లు అరకొరగానే ఉన్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహ నిర్మాణం నత్తనడకన సాగుతోంది. జగనన్న కాలనీలు నివాసయోగానికి అనుకూలంగా లేవంటూ చాలా చోట్ల లబ్ధిదారులు ముందుకు రాలేదు. ప్రస్తుతం అటువంటి లేఅవుట్లను రద్దుచేసేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్టు సమాచారం. ఈ నేపథ్యంలో భూమి కొనుగోలుకు ప్రభుత్వం చెల్లించిన డబ్బుల సంగతేమిటనేది చర్చనడుస్తోంది. డిసెంబర్ 21న 29 వేల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు చేస్తామని చెబుతున్నా, ఇప్పటికి 14 వేల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు ఈలోపు పూర్తయ్యే పరిస్థితి లేదు. రాష్ట్రంలోనే అతిపెద్ద లేఅవుట్‌గా చెప్పుకుంటున్న గుంకలాం జగనన్న కాలనీలో 12 వేల ఇళ్లకుగాను అక్షరాల 22 ఇళ్లకు మించి పూర్తికాలేదంటే అతిశయోక్తి కాదు. ఇందుకు ప్రధాన కారణం ప్రజల ఆర్థిక ఇబ్బందులు, ప్రభుత్వం మంజూరు చేసిన సొమ్ము సరిపోకపోవడమే. ఈనేపథ్యంలో ఇళ్లకు చెల్లిస్తున్న మొత్తాన్ని పెంచే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని సిపిఎంతోపాటు ప్రజాసంఘాలు కోరుతున్నాయి. దీనిపై జిల్లా పరిషత్తు సమావేశంలో చర్చించి తీర్మానం రూపంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుందా? లేదా? అన్నది వేచిచూడాల్సిందే.

సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు చలిని తట్టుకోలేక గజగజలాడుతున్నారు. పలు హాస్టళ్లలోని విద్యార్థులు జిల్లాలో సంచరిస్తున్న పులులు, ఏనుగుల భయంతోనే ఉన్నారు. మెనూ సరిగా అమలు చేయడం లేదంటూ విద్యార్థులు ఆందోళనలు చేశారు.

సమగ్ర శిక్ష ఎపిసి పలు పోస్టులను నిబంధనలకు విరుద్ధంగా నియమించారనే అభియోగం ఇటీవల చర్చనీయాంశగా మారింది. ఐసిడిఎస్, జిల్లా వైద్యారోగ్య శాఖలు కూడా ఇటువంటి అభియోగాన్ని ఎదుర్కొంటున్నాయి. పంటల బీమా విషయంలో రిపోర్టును వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలకు మించి చూపించారనే అభియోగాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటన్నింటిపైనా చర్చ జరుగుతుందా? లేదా? అన్నదానిపై జనం ఆసక్తి ఎదురు చూస్తున్నారు.

గ్రామాల్లో విద్యుత్తు లైన్లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. వీటిని తొలగించాలంటూ గత రెండు, మూడు సమావేశాల్లో చర్చ సాగింది. వచ్చే సమావేశం నాటికి ఈ చర్చకు అవకాశం లేకుండా పరిష్కరించాలని కూడా గత సమావేశం ఆదేశించింది. కానీ, ఆ ప్రమాదకరమైన పరిస్థితి ఎప్పటి మాదిరిగానే ఉంది.

మెంటాడ మండలం పోరాం గ్రామంలోని సుమారు 232 మంది కూలీల కార్డులను గుర్తుతెలియని డ్వామా సిబ్బంది రద్దుచేశారు. వారంతా చనిపోయి నట్టుగా కంప్యూటర్‌లో పేర్కొనడంతో పనులు లేకుండా పోయారు. ఈ వ్యవహారంపై ఇద్దరు ఎపిఒ, ఫీల్డ్ అసిసెంట్లపై చర్యలు తీసుకున్నప్పటికీ కార్డులు యాక్టివ్ కాలేదు.

పూసపాటిరేగ మండలంలో మెటీరియల్ కాంపొనెంట్ పనులను నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారన్న అభియోగంతో ఇటీవల రాష్ట్ర కేంద్రం నుంచి ప్రత్యేక బృందం విచారణ కోసం వచ్చింది. మండలమంతా ఇదే పరిస్థితి ఉందంటూ చాలా మంది కమిటీకి ఫిర్యాదు చేశారు.

18 శాఖలపై కీలక చర్చ

జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశానికి మొత్తం 50 ప్రభుత్వ శాఖల అధికారులను ఆహ్వానించాం. వీటిలో 18 శాఖలకు చెందిన విజయనగరం, పార్వతీపురం జిల్లాల అధికారులను మాత్రమే తొలుత లోపలికి అనుమతిస్తాం. వీటిలో ప్రధానంగా వైద్య, విద్య, వ్యవసాయం, సివిల్ సప్లై, ఎపిఇపిడిసిఎల్, గృహ నిర్మాణం, పిఆర్, డ్వామా, కో-ఆపరేటివ్ వీటి అనుబంధ శాఖలైన పశుసంవర్ధక శాఖ, సమగ్ర శిక్ష, పౌరసరఫరాల శాఖ తదితరాలు ఉన్నాయి. అనంతరం మిగిలిన శాఖలపై చర్చించేందుకు ప్రణాళిక రూపొందించాం.

- అశోక్‌కుమార్, జెడ్‌పి సిఇఒ

సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్లు

నూతనోత్తేజం

- భవిష్యత్తు పోరాటాలకు దిశా నిర్దేశం
- మహాసభల్లో పలు తీర్మానాలు
- ముగిసిన సిఐటియు జిల్లా మహాసభ

సిఐటియు జిల్లా పదో మహాసభ కార్మికుల్లో నూతనోత్తేజాన్ని నింపింది. భవిష్యత్తు పోరాటాలకు వారికి దిశానిర్దేశం చేశాయి. శృంగవరపుకోట మండలంలోని పోతనపల్లి వద్దనున్న తిరుమల సాయి కళ్యాణ మండపంలో జరిగిన జిల్లా మహాసభలు సోమవారం ఘనంగా ముగిశాయి. రెండోరోజు జరిగిన ప్రతినిధుల సభల్లో జిల్లాలో వివిధ రంగాల కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ప్రవేశపెట్టిన తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. ఉత్సాహంగా సాగిన ఈ మహాసభలు వివిధ రంగాల ప్రతినిధుల్లో పోరాట స్ఫూర్తిని నింపాయి. మహాసభల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ చేసిన ప్రసంగాలు కార్మికులను చైతన్య పరిచాయి.

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తొలిరోజు ఆదివారం భారీర్యాలీతో ప్రారంభమైన మహాసభల్లో ఎర్రజెండాను చేతబూని కార్మికులు కదం తొక్కారు. వేలాది మంది స్కీమ్‌వర్కర్లు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగసభలో రాష్ట్ర నాయకులు చేసిన ప్రసంగాలు కార్మిక వర్గంలో స్ఫూర్తిని నింపాయి. పోరాట పటిమను చెబుతూనే, కార్మికవర్గంపై ప్రభుత్వం చేపడుతున్న నిర్బంధకాండను, అణచివేత చర్యలను దునుమాడాయి. అనంతరం జరిగిన ప్రతినిధుల సభల్లో కార్మికుల పక్షాన చేస్తున్న పోరాటాలను మననం చేసుకుని, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించేందుకు ప్రతినిధులు సుదీర్ఘ చర్చలు చేశారు. అనంతరం పలు తీర్మానాలను సభ ముందుంచగా, ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మహాసభల స్ఫూర్తితో కార్మికులంతా సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు.

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శిగా పి.శంకరరావు, కె.సురేష్

పి.శ్రీనివాసరావు కె.సురేష్

సిఐటియు జిల్లా మహాసభలో 60 మందితో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పి.శంకరరావు, ప్రధాన కార్యదర్శిగా కె.సురేష్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా వి.రాములు, ఉపాధ్యక్షులుగా టి.సూర్యనారాయణ, టి.వి.రమణ, ఎం.శ్రీనివాస, జి.అప్పలసూరి, ఎస్.అనసూయ, మద్దిల రమణ, బూర్ల రమణ, కార్యదర్శులుగా ఎ.జగన్మోహన్, బి.సూర్యనారాయణ, వి.లక్ష్మి, బి.సుధారాణి, ఎ.గౌరినాయుడు, సిహెచ్ రామ్మూర్తినాయుడు, యుఎస్ రవికుమార్ ఎన్నికయ్యారు.

మహాసభల్లో పలు తీర్మానాలు ఆమోదం

రెండు రోజులపాటు జరిగిన సిఐటియు పదో జిల్లా మహాసభలో పలు తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అందులో ప్రధానమైనవి..

- పరిశ్రమల్లో 70 శాతం స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.
- స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి.
- కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి.
- షెడ్యూల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి.
- ఆటో, కళాసీ, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, సమర్థవంతంగా నడపాలి.
- ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసి, బ్యాంకులు, స్టీల్ ప్లాంట్ , రైల్వే, తదితర వాటిని ప్రయివేటీకరించొద్దు.
- హక్కుల కోసం పోరాడుతున్న కార్మికులపై, నాయకులపై ప్రభుత్వ నిర్బంధం విడనాడాలి.
- అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి. పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేసి, కనీస వేతనం 26వేలు ఇవ్వాలి.
- గీన్ అంబాసిడర్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలి

స్పందనకు 120 వినతులు

రీ ఓపెన్ అయితే దరఖాస్తుదారులతో మాట్లాడాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుండి 120 వినతులు అందాయి. వీటిలో వైద్యశాఖకు 17, డిఆర్‌డిఎకు 9, హౌసింగ్‌కు 7, మున్సిపల్ శాఖకు 9, ఇతర శాఖలకు సంబంధించి 28 అందాయి. అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 44 వినతులు వచ్చాయి. సదరం, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, భూ సమస్యలు, గృహాల కోసం విజ్ఞప్తులు వచ్చాయి. ఈ వినతులను కలెక్టరు ఎ. సూర్యకుమారి, జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతిరావు, ఉప కలెక్టర్లు సుదర్శన దొర, సూర్యనారాయణ, పద్మావతి స్వీకరించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రీ ఓపెన్ వినతులపై అధికారులు ప్రత్యేకదృష్టి పెట్టి, దరఖాస్తుదారులతో మాట్లాడాలని, ఆ తర్వాతే డిస్పోజ్ చేయాలనీ ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా రీ ఓపెన్ దరఖాస్తులను పరిష్కరించకపోతే తర్వాత డిస్పోజ్ చేయడానికి కుదరదని తెలిపారు.

క్షయ వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలి

క్షయవ్యాధిగ్రస్తులు జిల్లాలో 350 మంది ఉన్నారని, వారిని మానవత్వంతో ఆదుకోవడానికి అధికారులు ముందుకు రావాలని కలెక్టర్ స్పందనలో పిలుపునిచ్చారు. చికిత్స పొందుతున్న వారి భోజన, ఇతర ఖర్చుల కోసం నెలకు రూ.700 గానీ, వస్తురూపేణా కానీ సహాయం అందించాలని కోరారు. వ్యాధిగ్రస్తులలో పిల్లలు కూడా ఉన్నారని వారిని దత్తత తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

యువతను మోసగించిన ప్రభుత్వం

విజయనగరం కోట : నిరుద్యోగ యువతను వైసిపి ప్రభుత్వం మోసం చేస్తుందని తెలుగు యువత నాయకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ముందు తెలుగు యువత ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతి అందించారు. యువతకు స్వయం ఉపాధికి కార్పోరేషన్ల ద్వారా రుణాలివ్వాలని, బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పారిశ్రామిక క్యారిడార్ ఏర్పాటు చేయాలని కోరారు. తెలుగుయువత పార్లమెంట్ అధ్యక్షులు వేమలి చైతన్య బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పైడిరాజు, నియోజకవర్గ అధ్యక్షులు గంటా రవి, పట్టణ అధ్యక్షులు మతా బుజ్జి, చిప్పాడ స్వామి, పాలూరి రాజునాయుడు, కర్రోతు పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

వినతి అందిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

'పే అండ్ ప్లే'ను రద్దుచేయాలని వినతి

విజయనగరం టౌన్ : క్రీడా మైదానాలను, ఇండోర్ స్టేడియాలను, జిమ్ సెంటర్లను పే అండ్ ప్లే పేరుతో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ప్రయివేట్ కాంట్రాక్టర్లకు లీజుకిచ్చే నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ హరీష్, ఎన్. రుద్ర ప్రసాద్ డిమాండ్‌చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ సూర్యకుమారి, సెట్విజ్ సిఇఒకి వినతులు అందించారు. పే అండ్ ప్లే విధానం వల్ల పేద విద్యార్థులు క్రీడలకు దూరం అవుతున్నారని వారు తెలిపారు. క్రీడా మైదానాల్లో ఫీజులు వసూలు చేసే విధానాన్ని నిలిపివేయాలని, నూతనంగా కోచ్‌లను ఏర్పాటు చేయాలని, ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.సతీష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో కార్మిక శాఖ నిద్రపోతుందా?

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పరిశ్రమల్లో ప్రతిరోజూ ఏదో ఒక చోట ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నా జాగ్రత్తలపై చర్యలు తీసుకోకుండా కార్మిక శాఖ ఏమైనా నిద్రపోతుందా? అని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలో పోతనపల్లి వద్దనున్న తిరుమల సాయి కళ్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వస్తే ఉత్తరాంధ్రలో మూతపడ్డ ఫ్యాక్టరీలన్నీ తెరిపిస్తానని సిఎం జగన్ పాదయాత్రలో హామీఇచ్చి.. గద్దెనెక్కాక ఫ్యాక్టరీలను శాశ్వతంగా మూతపడే విధంగా చేశారని విమర్శించారు. నెల్లిమర్ల జ్యూట్ మిల్లులో 5 వేల మంది కార్మికులు పనిచేసేవారని, కానీ నేడా సంఖ్య రెండు వేలకు తగ్గిందని తెలిపారు. గరివిడి ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలో 800 మంది పనిచేస్తే, ప్రస్తుతం ఆ సంఖ్య 115కు పరిమితమైందని చెప్పారు. బొబ్బిలి మైతాన్ కంపెనీకి భూములు ఇచ్చిన 270 మంది పనిచేసేవారని, కానీ వారిని తొలగించి, స్థానిక ఎమ్మెల్యే అండతో ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది అన్యాయమని సిఐటియు ప్రశ్నిస్తే ప్రభుత్వం కార్మికుల పక్షాన నిలబడకుండా, కార్మిక నాయకులపై, కార్మికుల పై 320 కేసులను పెట్టి 40 రోజులపాటు జైల్లో ఉంచారని ధ్వజమెత్తారు. అందులో 30 మంది మహిళలు కూడా ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఉన్న చట్టాలను, ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే, కార్మికులపై తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో 15 ఏళ్ల కిందట వేతన సవరణ చేశారని, 73 షెడ్యూల్లో 60 వేల మంది కార్మికులు రూ.8 వేలకు, 10 వేలకు పని చేస్తున్నారని తెలిపారు. అనేక కంపెనీల్లో కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. కార్మికులకు వేతన సవరణ చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏ విధమైన నష్టమూ వాటిల్లదని తెలిపారు. వేతన సవరణ చేయాలని పలుమార్లు డిమాండ్ చేసినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో కార్మిక శాఖ ఉందో, లేదో అర్థం కావడం లేదన్నారు. స్కీమ్‌వర్కర్లు కరోనా సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించారని. వారికి అతితక్కువ వేతనాలు ఇవ్వడమే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తించకుండా చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వీటిపై అంశాలపై జిల్లా మహాసభల్లో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు జి.అప్పలసూరి, మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులకు సత్వర న్యాయం

ప్రజాశక్తి-విజయనగరం

స్పందనలో అర్జీలు అందజేసిన వారికి సత్వరం న్యాయం చేకూర్చాలని ఎస్‌పి దీపిక.. పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో ఎస్‌పి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి 33 ఫిర్యాదులు అందాయి. అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. వాటిని పరిష్కరించేందుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని సూచించారు. ఈ

మంత్రి బొత్స జిల్లాకు రాక

ప్రజాశక్తి-విజయనగరం

విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం జిల్లాకు చేరుకున్నారు. మంగళవారం జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 4 గంటలకు ఎస్.కోట మండలం చినకండేపల్లిలో శ్రీసత్యసాయి దివ్యామృతం కేన్సర్ ఆసుపత్రిని మంత్రి ప్రారంభిస్తారు. 23న ఉదయం 9.30 గంటలకు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట బయలుదేరి వెళ్లనున్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సూర్యకుమారి, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

సంక్షేమ పథకాల ద్వారా

మత్స్యకారులకు ఆర్థిక చేయూత

ప్రపంచ మత్స్యకార దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా మత్స్యకారులకు వివిధ రూపాల్లో ఆర్థిక చేయూత లభిస్తోందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. సోమవారం ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా నర్సాపురం నుంచి సిఎం జగన్ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టరేట్‌లో విసి హాల్ నుంచి ఆన్‌లైన్ ద్వారా జిల్లా కలెక్టర్ సూర్యకుమారి, ఎమ్మెల్సీ సురేష్ బాబు, మత్స్య శాఖ డీడీ నిర్మల కుమారి, మత్స్యకార కో-ఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ బి.చినప్పన్నతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేటనిషేధ భృతిలో భాగంగా జిల్లాలోని 2944 మత్స్యకార కుటుంబాలకు రూ.294 లక్షలు అందజేశామని పేర్కొన్నారు. 2200 మందికి పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేయడం, సీడ్ ఫారం నెలకొల్పడం ద్వారా ఆర్థిక లబ్ధి చేకూరుస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో మత్స్య శాఖ డైరెక్టర్ ఎం.నరసింహులు పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యులకు ప్రశంసలు

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తున్న వైద్యులను కలెక్టర్ సూర్యకుమారి అభినందిస్తూ మెమోంటోలను అందజేశారు. రెండు నెలల కాలంలో ప్రజలకు వైద్యం చేరువ చేస్తూ మెరుగైన సేవలు అందిస్తున్న వైద్యుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ వైద్యుల జాబితాను ప్రకటించింది. వీరిలో జిల్లాకు చెందిన తెర్లాం వైద్యాధికారి రవికుమార్, ఎల్.కోట నుండి మురళీకృష్ణ, కొండవెలగాడ నుండి ప్రశాంత్ రాజ్, వాడాడ నుండి సంతోష్, చల్లపేట నుండి సంజయ్ రాణి.. ఉత్తమ వైద్యుల అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి రమణకుమారి, డిసిహెచ్ఎస్ నాగభూషణరావు, సూపరింటెండెంట్ పద్మ లీలు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ

పోలీస్‌స్టేషన్ ముందు మృతదేహంతో ధర్నా

రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్ ● సిఐ హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పక్కింటి వాళ్లు తిట్టారని మనస్తాపం చెందిన పట్టణానికి చెందిన కాళ్ల కిరణ్ (23) శనివారం గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. యువకుడి పరిస్థితి విషమంగా ఉండటంతో పట్టణంలో ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కిరణ్ ఆదివారం మృతి చెందాడు. పోస్టుమార్టం ముగిసిన అనంతరం కిరణ్ మృతదేహాన్ని తీసుకుని కుటుంబ సభ్యులు నేరుగా సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఎస్.కోట పోలీసుస్టేషన్ ఎదురుగా విశాఖ-అరకు ప్రధాన రహదారిపై బైఠాయించారు. దీంతో ఇటు విశాఖ, అటు అరకు వెళ్లే ఇరువైపులా భారీగా స్తంభించాయి. సిఐ బాల సూర్యారావు, వేపాడ, ఎల్.కోట ఎస్ఐలు రాజేష్, ముకుందరావు వారిని సముదాయించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కిరణ్ మృతికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేసే వరకు ఆందోళన విరమించేదిలేదని కూర్చున్నారు. సిఐ సూర్యారావు, పోలీసులు ఆందోళనకారులను పక్కకు లాగేసేందుకు చేసిన ప్రయత్నాలు కూడా బెడిసికొట్టాయి. సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో స్థానిక పెద్దలు కలుగజేసుకుని మృతుడి కుటుంబీకులకు సిఐ సూర్యారావుతో స్పష్టమైన హామీ ఇప్పించారు. దీంతో ఆందోళనను విరమించారు. సిఐ బాలసూర్యారావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆదిలక్ష్మి, దేవి అనే వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. కిరణ్ రిసిన లేఖను కూడా పోలీసులు స్వాధీనం చేసుకుని, పరిశీలిస్తున్నామన్నారు. అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు పోలీసులకు అరగంటకు పైగా సమయం పట్టింది.

స్టేషన్ ఎదుట రోడ్డుపై మృతదేహంతో బైఠాయించిన కిరణ్ కుటుంబ సభ్యులు, బంధువులు

జనసేనలో చేరుతా

వ్యాపారవేత్త గురాన అయ్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రయాణించేందుకు నిర్ణయం తీసుకున్నానని, త్వరలోనే మంచి ముహూర్తం చూసి ఆ పార్టీలో చేరుతానని ప్రముఖ వ్యాపారవేత్త గురాన అయ్యలు అన్నారు. సోమవారం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దనున్న హోటల్ జిఎస్ఆర్ ఇంటర్నేషనల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న హైదరాబాద్‌లో పవన్ కళ్యాణ్‌ను మర్యాద పూర్వకంగా కలిశానని చెప్పారు. జనసేన సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ పోరాటస్ఫూర్తి, అందరికీ సమన్యాయం, మంచి చేయాలనుకునే పవన్ నాయకత్వం నచ్చిందని తెలిపారు. అందుకే పవన్ ఆశయాల కోసం కలిసి నడవాలని నిర్ణయించానని వెల్లడించారు. సుపరిపాలన ఇచ్చే పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని అందరూ బలపరిచే సమయం ఆసన్నమైందన్నారు. గతంలో ప్రజారాజ్యం పార్టీలో పనిచేసినవారు, వివిధ పార్టీల్లో కష్టపడినా గుర్తింపు లేనివారు జనసేనలో చేరి మద్దతు ఇవ్వాలని కోరారు. జిల్లాలోని ప్రధాన సమస్యలను జనసేన అధినేత దృష్టిలో పెట్టి, వాటిపై పోరాడుతూ పార్టీ బలోపేతం దిశగా ముందుకెళ్తానని తెలిపారు.

స్వర్ణకార డిజైన్లపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని బొండాడవీధిలో స్వర్ణకార క్లస్టర్ భవనంలో ఈ నెల 8 నుంచి నిర్వహిస్తున్న హ్యాండ్ స్కెచ్ డిజైన్, డైమండ్ ఎసెర్టింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాం సోమవారంతో ముగిసింది. ఈ శిక్షణకు 80 మంది స్వర్ణకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్లస్టర్ అధ్యక్షులు కోసూరు మోహన్ మాట్లాడుతూ వినియోగదారుల ఆలోచనలు, మారుతున్న ట్రెండ్‌కి అనుగుణంగా హ్యాండ్ స్కెచ్ డిజైన్ వేసి ఆర్డర్ తీసుకోవడానికి స్వర్ణకారుడికి శిక్షణ చాలా ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. విజయవాడకు చెందిన క్లస్టర్ ఇంప్లిమెంట్ ఏజెన్సీ, విశ్వకర్మ స్వర్ణకార సహకార సంఘం ప్రతినిధి గొల్లపల్లి అనీల్‌కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ జ్యుయలరీల వల్ల సంప్రదాయ స్వర్ణకారులు ఉనికిని కోల్పోతున్న పరిస్థితిలో ఇలాంటి శిక్షణతో వారిలో నైపుణ్యం పెరుగుతుందని తెలిపారు. దీంతో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని చెప్పారు. ఇటువంటి నైపుణ్యం ఉన్న వారిని ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. శిక్షణ తీసుకున్న 50 మందికి త్వరలో సర్టిఫికెట్లు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల శివకుమార్, కోశాధికారి దోసూరు మహేష్, అనుపోజు సింహాచల ఆచారి, కుప్పిలి శ్రీనివాస్, వరదా మోహనరావు, క్లస్టర్ సిడిఇ డి సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న క్లస్టర్ అధ్యక్షులు కోసూరు మోహన్

రేషన్ దుకాణాలు తనిఖీ

గజపతినగరం : మండలంలోని లింగాలవలస, తుమ్మికాపల్లి రేషన్ దుకాణాలను సివిల్‌సప్లై డిటి రవిశంకర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న బియ్యానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. లింగాలవలస రికార్డులు సరిపోయాయని, తుమ్మికాపల్లి రేషన్ దుకాణానికి సంబంధించిన రికార్డులను పరిశీలించగా 5008 కేజీల బియ్యం నమోదు కాలేదని అన్నారు. దీంతో డీలర్ రామసూర్యపై 6ఎ కేసు నమోదు చేశామని, దాని ఇన్చార్జి బాధ్యతలు లింగాల వలస నిర్వాహకుడు బార్నాల వెంకటరావుకు అప్పగించడం జరిగిందని అన్నారు

శ్రీరామ్ కాలేజ్ విద్యార్థుల సత్తా

గరివిడి : ఇటీవల జరిగిన సిఎం కప్ నియోజకవర్గ పోటీలలో శ్రీరామ్ విద్యాపీఠం విద్యార్థులు సత్తాను చాటారు. కబడ్డీలో లావణ్య, రోషిని, విశ్వేశ్వరి, మీనాక్షి, వాలీబాల్‌లో భవాని, విశాలాక్షి, గణేష్ అఖిల్ సెలెక్ట్ అయి క్రీడల్లో రాణించారని కాలేజీ కరస్పాండెంట్ కమలాకర్ రావు, ప్రిన్సిపాల్ మజ్జి భాస్కరరావు, ప్రసన్నలక్ష్మి, అకడమిక్ అడ్వైజర్ బి. రవి, పీడీలు శ్రీనివాస్, భానుమూర్తి సోమవారం ప్రకటించి వారిని అభినందించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

వేపాడ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గత వారం రోజులుగా 55వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

శాశ్వత భూ హక్కు పై సమావేశం

వేపాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ సచివాలయాల పరిధిలోగల రైతులకు శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీపై ఎంపిడిఒ బి. పట్నాయక్ సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, డిటి సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయం సర్వేర్లు పాల్గొన్నారు.

బయోమెట్రిక్‌కు సిగ్నల్ సమస్య

ఆరుబయట బయోమెట్రిక్ చేస్తున్న సిబ్బంది

వేపాడ : మండల కేంద్రంలోని బక్కునాయుడుపేట గురుకుల వసతి గృహంలో విద్యార్థులకు బయోమెట్రిక్ సిగ్నల్ సరిగా లేనందున 93 శాతం మందికి మాత్రమే బయోమెట్రిక్ జరిగింది. మిగతా విద్యార్థులకు కూడా బయోమెట్రిక్ పూర్తి చేయాలని సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు. సిఆర్‌పి వై లక్ష్మి, మండల విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సంతోష్, వసతి గృహం సిబ్బంది సెల్‌ఫోన్ సిగ్నల్ కోసం బయటకు వచ్చి బయోమెట్రిక్ చేశారు.

సంతను నిలుపుదల చేయాలి

జామి: రాష్ట్రంలో పశువులు సంతలపై నిషేదం ఉన్నప్పటికి వాటిని బేఖాతరు చేస్తు లోట్లపల్లిలో అక్రమంగా పశువులు సంత నిర్వహించిన సంత యజమానిని అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం లోట్లపల్లిలో ఆయన మాట్లాడుతూ లంపిస్కిన్ అనే వైరస్ పశువులకు సోకి వేలాదిగా మరణిస్తున్న నేపథ్యంలో పశువులు సంతలు నిర్వహించకూడదని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ పూనం మాల కొండయ్య జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ లోట్లపల్లి సంత యాజమాన్యం అధికారులు ఆదేశాలను తుంగలో తొక్కి వేలాది పశువులుతో సంత నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా అదికారులు అందరికి పిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు దమరసింగి ఈశ్వరావు, బోని గణపతి, కోట అప్పన్న పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

శృంగవరపుకోట : ఆర్‌టిసి ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అందులో భాగంగా ఈ నెల 27వ తేదీ వరకు ప్రయాణికుల సంతోషకర వారోత్సవాలను వారం రోజులపాటు డిపో పరిధిలో నిర్వహిస్తున్నామని ఆర్టీసీ డిపో మేనేజర్ కె రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణికుల సంతోషకర వారోత్సవాలలో భాగంగా ఆర్టీసీ అందిస్తున్న సేవలను వివరించడంతో పాటు ఎటువంటి ఫిర్యాదు వచ్చిన వెంటనే పరిష్కరించేటట్లు కార్యాచరణను రూపొందిస్తున్నామని అన్నారు. ఆర్‌టిసి సేవలను మరింత క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లేందుకు సిబ్బంది అందరికీ తగు సూచనలు ఇస్తూ ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.


భజన గురువును సత్కరిస్తున్న ఎంపిపి సత్యవంతుడు

కృష్ణరాయుడి పేటలో అన్నదానం

వేపాడ : మండలంలోని కృష్ణరాయుడుపేట గ్రామంలో సోమవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎంపిపి దొగ్గ సత్యవంతుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భజన గురువును దుస్సాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, సోంపురం ఎంపిటిసి ఆకుల సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ చలిబోని ముసలి నాయుడు, మాజీ సర్పంచ్ పైడి బాబు, బల్లంకి వార్డు మెంబరు బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను పరిశీలించిన జెడ్‌పిటిసి

గరివిడి: చీపురుపల్లి పట్టణంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ బాలయోగి గురుకుల పాఠశాలలను జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష సోమవారం పరిశీలిం చారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు వండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, యువ నాయకులు బెల్లాన వంశీ కృష్ణ, గ్రామ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఎంపిడిఒ కె. కృష్ణంరాజు, తహశీల్దార్ యం. సురేష్, మండల విద్యాశాఖాధికారి భాను ప్రకాష్ పాల్గొన్నారు.

జిన్నాంలో పారిశుధ్య పనులు

గజపతినగరం : మండలంలోని జిన్నాంలో అధ్వానంగా పారిశుధ్యం అనే శీర్షికను ప్రజాశక్తిలో వెలువడిన కథనానికి స్పందించిన అధికారులు సోమవారం పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు చేపట్టారు.

పంటనమోదు పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

పంట నమోదు పత్రాలను సోమవారం అలజంగి గ్రామంలో పంపిణీ చేశారు. ఇన్‌ఛార్జి ఎడి ఎం.శ్యామసుందర్ పంట నమోదు చేసుకున్న రైతులందరికీ రసీదులు అందించారు. కార్యక్రమంలో విఎఎలు లత, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బొబ్బిలి : ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. సోమవారం పట్టణంలోని మల్లంపేటలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక నాయకులతో కలిసి ప్రతీ గడపగడపకు వెళ్లి మూడేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా? లేదా? అని ఆరాతీశారు. ప్రజా సమస్యల పరిష్కారానికే ఈ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఆయన తెలిపారు. దానిలో భాగంగానే ప్రజల చెంతకు వస్తున్నట్లు స్థానికులకు తెలియజేశారు. ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా అర్హులైన వారికి నేరుగా వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, వైస్‌చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, వైసిపి మండల అధ్యకులు శంబంగి వేణుగోపాలనాయుడు, బుడా చైర్‌పర్సన్ ఇంటి పార్వతి, వైసిపి పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, 24వ వార్డు కౌన్సిలర్ ఇంటి గోవింద, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం

ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరంలో విద్యారంగ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పోరాటం చేస్తామని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడానికి ఎస్ఎఫ్ఐ గజపతినగరం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల మహాసభను సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించి అనంతరం ఆదిత్య డిగ్రీ కాలేజ్ గ్రౌండ్‌లో బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభను ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను నాశనం చేయడానికి నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చాయన్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. సభ అనంతరం ఎస్ఎఫ్ఐ నూతన మండల అధ్యక్ష కార్యదర్శులుగా కల్పన, కృష్ణలను ఎన్నుకున్నారు. గజపతినగరం నూతన కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మఒడిలను వెంటనే విడుదల చేయాలని, నూతన విద్యా విధానం రద్దు చేయాలని, సంక్షేమ హాస్టల్‌కు సొంత భవనాలు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని, మెస్ ఛార్జీలు పెంచాలని, డిగ్రీ విద్యార్థులకు ఇంటెన్షిప్‌లో మార్పులు చేస్తూ అది ఒక ఆప్షన్‌గా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు డి. రాము, జిల్లా సహాయ కార్యదర్శి నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు బి లక్ష్మణ, మండల కమిటీ సభ్యులు లక్ష్మణ, సాయి, దిలీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంకాడ: నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

సమస్యలు సుడిగుండంలో వసతి గృహం

పూసపాటిరేగ : మండల కేంద్రంలోని వసతి గృహం సమస్యలకు నిలయంగా మారిందని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. సోమవారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ అధ్వర్యంలో స్థానిక బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జె. రవి కుమార్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఈ హాస్టల్ పరిస్థితి చూస్తుంటే సమస్యలకు నిలయంలా ఉందన్నారు. కనీసం ఇక్కడున్న విద్యార్థులకు మరుగుదొడ్ల సౌకర్యం కూడా హాస్టల్ యాజమాన్యం కల్పించడం లేదన్నారు. గత రెండు సంవత్సరాలుగా చిన్న పిల్లల హాస్టల్ ఇదే బిల్డింగ్‌లో అద్దెకు తీసుకుని నడుపుతున్నారని ఈ రెండు సంవత్సరాలలో వాస్‌రూం నిర్మించాలని ఇంగిత జ్ఞానం కూడా హాస్టల్ వార్డెన్‌కు లేకపోవడం దుర్మార్గమని అన్నారు. సరిగ్గా నెల రోజుల క్రితం ఈ హాస్టల్ పక్కనే ఉన్న బావిలో పడి చింతపల్లికి చెందిన ఒక కాలేజీ విద్యార్థి మృతి చెందాడని, ఇదే హాస్టల్లో ఉంటున్న చిన్నపిల్లలు మరుగుదొడ్ల సౌకర్యం కొరకు అదే పొలాల్లో వెళితే ఆ బావిలో పడకుండా ఉంటారని వార్డెన్ హామీ ఇవ్వగలరా అని ప్రశ్నించారు.

హాస్టల్లో చలికాలం వచ్చినా సరే ఇప్పటి వరకు విద్యార్థులకు కనీసం దుప్పట్లు కూడా ఇవ్వలేదని, గచ్చు మీద విద్యార్థులు పడుకుంటున్నారని విద్యార్థులు ఆరోగ్య పరిస్థితి గురించి వార్డెన్ ఎప్పుడైనా ఆలోచించారా అని ప్రశ్నించారు. వార్డెన్ జానకిరావు హాస్టల్ సదుపాయాలు కనీసం పట్టించుకోవట్లేదని ఎస్ఎఫ్ఐ నాయకత్వం హాస్టల్‌ని నాలుగుసార్లు వచ్చిన ఒకసారి కూడా హాస్టల్ వార్డెన్ గాని, సిబ్బంది గాని కనిపించిన దాఖలాలు లేవని అన్నారు. హాస్టల్లో ఉన్న విద్యార్థులకు ఏమైనా జరిగితే ఎవరిది బాధ్యత అని ప్రశ్నించారు. తక్షణమే హాస్టల్లో ఉన్న విద్యార్థులకు మరుగుదొడ్ల సౌకర్యం, చలికాలంలో దుప్పట్లు అందించాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్ జానకిరామ్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బి. బాలాజీ, స్థానిక మండల కమిటీ సభ్యులు పైడి తదితరులు ఉన్నారు.

గజపతినగరం: నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

డెంకాడ: విద్యారంగ సమస్యలపై విద్యార్థులంతా ఏకమై పోరాటం చెయ్యాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పావని అన్నారు. ఎస్ఎఫ్ఐ డెంకాడ మహాసభలు మండల కేంద్రంలో గల జూనియర్ కళాశాలలో జరిగాయి. ఈ సందర్భంగా 21 మందితో నూతన మండల కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రంలో విద్యారంగాన్ని నాశనం చేసే విధంగా ప్రభుత్వాలు తీసుకువస్తున్న విధానాలను అందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించాలని దానికోసం విద్యార్థులందరూ ఏకం అవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్ నిధులు వెంటనే విడుదల చేయాలని, నాడు నేడు పనులకు సంబంధించిన నిధులు వెంటనే విడుదల చేయాలని, మంచినీటి సౌకర్యం వెంటనే కల్పించాలని కోరారు. నూతన మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా అభి, మురళీలు ఎన్నికయ్యారని, మండల గర్ల్స్ కన్వీనర్‌గా గీతా మాధురి ఎన్నికయ్యారని తెలిపారు. నూతన నాయకత్వంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

పేదలకు వస్త్రదానం

ప్రజాశక్తి - జామి

మండల కేంద్రంలో బసవేశ్వర ఆలయంలో బసవేశ్వర గనారాధన కార్యక్రమం సోమవారం ఘంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావులు పాల్గొని ముందుగా బసవేశ్వరుడును దర్శించుకున్నారు. అనంతరం దేవాంగల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బసవేశ్వర గణారాధన కార్యక్రమంలో పేద ప్రజలకు వస్త్ర దానం కార్యక్రమంలో పాల్గొని పేద ప్రజలకు వస్త్ర దానం చేశారు. ఏటా పేదలకు వస్త్ర దానం చేస్తున్న దేవాంగుల సంక్షేమ సంఘం సేవలను జెడ్‌పి చైర్మన్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, గడపగడపకి మన ప్రభుత్వం ఎస్.కోట ఇంచార్జ్ సూర్యనారాయణ రాజు, పార్టీ కన్వీనర్ గొర్లె రవికుమార్, ఎంపిపి సబ్బవరపు అరుణ, జెడ్‌పిటిసి గొర్లే సరయు, బొమ్మన వరలక్ష్మీ టెక్స్‌టైల్ అధినేత గోరు రామారావు, ప్రకాష్ సిల్క్ ప్యాలస్ అధినేత ఉప్పు ప్రకాష్, స్టేట్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ డి.సత్యారావు, దేవాంగుల సంఘం జనరల్ సెక్రెటరీ ఎస్. త్రినాధ్ రావు, ఆంధ్ర గోపాలకృష్ణ, వైస్ ఎంపిపి గేదెల వెంకట్రావు, ఎర్నింటి శేషు, నెక్కల సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ చిప్పాడ లక్ష్మీ, ఎంపిటిసిలు, గ్రామ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి వద్ద గల ఉమామహేశ్వర ఆలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు స్వామివారి అభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం వైసిపి పరిశీలకులు కెవి. సూర్యనారాయణ రాజు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జామి జెడ్‌పిటిసి సరయు, వేపాడ ఎంపిపి సత్యవంతుడు, ఎస్.కోట జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధా రాణి, తుమ్మికాపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు, ఎంపిటిసి పిల్లా లక్ష్మీ, సాయిబాబా గొరపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న జెడ్‌పి చైర్మన్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

గిరిజనులకు న్యాయం చేయాలని ధర్నా

విజయనగరంటౌన్ : బాడంగి మండలం వీరసాగరం గిరిజనులకు న్యాయం చేయాలని జనసేన ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతి అందించారు. చేపల చెరువులపై ఆధారపడి బతికే గిరిజనులకు అధికార రాజకీయ నాయకులు, అధికారులు, మత్స్యకార సొసైటీ కలిసి జీవనోపాధి లేకుండా చేశాయని జనసేన నాయకులు ఆదాడ మోహనరావు తెలిపారు. గిరిజనులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. కలెక్టర్ వెంటనే స్పందిస్తూ.. ఆర్‌డిఒను పిలిచి, వీరసాగరాన్ని సమస్యాత్మక గ్రామంగా గుర్తించి, గిరిజనులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు త్యాడ రామకృష్ణారావు, ఆ గ్రామస్తులు, గిరిజనులు పాల్గొన్నారు.

వ్యసనాల బారిన పడ్డవారిలో మార్పు తేవాలి

విజయనగరం: మద్యపానం, ఇతర చెడు అలవాట్లకు బానిసలైన వారిని గుర్తించి వారిలో మార్పు తీసుకురావాలని, వారికి జీవితాల్లో వెలుగులు నింపాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. సారా తయారీ, విక్రయం, తాగుడు వంటి వాటి చట్ట విరుద్ధ కార్యకలాపాల్లో భాగస్వామ్యమైన వారికి జీవనోపాధి కల్పించే విషయమై కలెక్టర్ తన ఛాంబర్లో సోమవారం వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ఎస్ఇబి గుర్తించిన 110 మందిలో ఇప్పటికే 88 మందికి వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా రూ.43 లక్షల మేర రుణాలు ఇప్పించి జీవనోపాధి కల్పించామని డిఆర్‌డిఎ ఎపిడి కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన 22 మందికి త్వరలోనే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి శ్రీదేవీరావు, సెబ్ ఎసి శైలజా రాణి, ఎస్‌డిసి పద్మావతి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి గోవిందరావు, మెప్మా పీడీ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని పురిటిపెంటలో హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వ ఉద్దేశంలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో ఒక వెల్నెస్ సెంటర్‌ను నిర్మించడం జరుగుతుందని అన్నారు. అందులో భాగంగానే వైద్య శాఖలో భారీగా నియమకాలు చేపట్టామని, మిగతా ఖాళీలను కూడా భర్తీ చేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం ప్రాథమిక వైద్యాధికారి సాయి కృష్ణారెడ్డి, సురేష్ బాబుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, సర్పంచ్ బెల్లాన త్రినాధ రావు, నాయకులు సురేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెల్నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ప్లాస్టిక్ అమ్మకాలపై తనిఖీలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతిలో పాలిథిన్, ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు జరపరాదని కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం నగర పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా రామతీర్థం జంక్షన్, మొయిద జంక్షన్ ప్రాంతాల షాపులపై నగర పంచాయతీ కమిషనరు పి.బాలాజీ ప్రసాద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిథిన్, ప్లాస్టిక్ అమ్మకాలు జరపరాదని, నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు. ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లకు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు వినియోగించాలని సూచించారు. కాగా ప్లాస్టిక్ వాడిన వారి వద్ద 10 కేజిలు ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

దుకాణంలో తనిఖీ చేస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

ఈ కార్యక్రమంలో శానిటరీ ఇంచార్జ్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాస రావు, సీనియర్ అసిస్టెంట్ డి.సురేష్ కుమార్, శానిటరీ కార్యదర్శులు టి. రాము, పి. రమణ, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి- గరివిడి

చీపురుపల్లి పట్నంలో రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేయాలని సోమవారం నియోజక వర్గ జనసేన పార్టీ నాయకులు తుమ్మగంటి సూర్యనారాయణ, విసినిగిని శ్రీనివాసరావు, రమేష్ రాజు, రామచంద్ర రాజు రైల్వే బ్రిడ్జి ప్రాంణాంగంలో రిలే నిరాహర దీక్ష చేశారు. తుమ్మగంటి సూర్యనారాయణ మాట్లాడుతూ రైల్వే బ్రిడ్జి పనులు ఇంకా ప్రారంభించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్రిడ్జ్ నిర్మాణం పేరిట చిన్న చిన్న దుకాణాలను తొలగించారని ఆరు నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పిన స్థానిక ప్రజాప్రతినిధులు ఒక్క ఇటుక కూడా వేయలేదన్నారు. రైల్వే బ్రిడ్జి నిర్మించకపోవడం వల్ల పాలకొండ మీదగా విశాఖపట్నం వెళ్లాలంటే ఉత్తరావల్లి మీదగా, లేదా రాజాం శ్రీకాకుళం మీదుగా వెళ్లల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిర్మాణ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, పాల్గొన్నారు.

రిలే నిరాహారదీక్ష చేస్తున్న జనసేన నాయకులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల గురుకుల పాఠశాల విద్యార్థులు అండర్ 19 షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయినట్లు ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు తెలిపారు. ఆదివారం డెంకాడ మండలంలోని జమ్మునారాయణపురం జ్యోతిరావు పూలే పాఠశాలలో రాష్ట్ర స్థాయి ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికల్లో కొప్పెర్ల గురుకులా నికి చెందిన విద్యార్థులు గౌతమ్, లోకేష్, శివ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 22 నుండి 24 వరకూ అనకాపల్లి జిల్లాలోని సబ్బవరంలో జరిగే రాష్ట్ర పోటీలలో పాల్గొంటారన్నారు. గురుకులం విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడంతో గురుకుల పాఠశాల జిల్లా సమన్వయ కర్త చంద్రావతి, పీడీ కృష్ణ, పిఇటి సత్యనారాయణ, విద్యార్థులు అభినందించారు.

సచివాలయ ఉద్యోగి మృతి

కొత్తవలస : మండలంలోని రెల్లి పంచాయతీ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్న విజినిగిరి సన్యాసిరావు ట్రాక్టర్ ఢీకొని మృతి చెందారు. రెల్లి పంచాయతీలో సోమవారం విధులు నిర్వహించి వస్తున్న సన్యాసిరావును అదే గ్రామంలో ట్రాక్టర్ ఢీ కొంది. తలకు బలమైన గాయవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపిడిఒ వై.పద్మజ తన సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని స్వగ్రామం జామి మండలం కాగా ప్రస్తుతం వేపగుంటలో నివాసముంటున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

పూసపాటిరేగ : మండలంలోని కొల్లాయివలసలో నూతనంగా ఏర్పాటు చేసిన త్రీపేస్ ట్రాన్సఫార్మర్‌ను సోమవారం ఎంపిపి మహంతి కళ్యాణి ప్రారంభించారు. చాలా కాలంగా ఆ గ్రామంలో విద్యుత్ ఉన్నప్పటికీ గృహాలకు లోఓల్టేజ్ విద్యుత్ సరఫరా అవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎంపిపి మహంతి కళ్యాని దృష్టికి రావడంతో వెంటనే విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సహకారంతో విద్యుత్ అధికారులను సంప్రదించారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికార్లును తీసుకువెల్లి సమస్యలను చూపించారు. దాంతో ఆయా అధికార్లు స్పందించి త్రీపేస్ ట్రాన్సఫార్మర్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మట్లాడుతూ చాలా గ్రామాల్లో లో ఓల్టేజ్ ఉన్నట్లు తెలిసిందన్నారు. వాటిని కూడా త్వరలోనే పరిష్కరించే విదంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, సర్పంచ్ పైడి సుజాత, ఉప సర్పంచి తాడిశెట్టి బాబు, మహంతి శ్రీనువాసరావు, విద్యుత్ శాఖ అధికార్లు , వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎంపిపి కళ్యాణి

నియోజకవర్గ జట్ల ఎంపిక

విజయనగరం టౌన్ : జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా ఎపి సిఎం స్పోర్ట్స్ ప్రైజ్‌మనీ పోటీలకు నియోజకవర్గ జట్ల ఎంపిక పూర్తి అయ్యింది. సోమవారం స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరిగిన ఎంపికల్లో నాలుగు క్రీడాంశాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. చీఫ్ కోచ్ అప్పలనాయుడు, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఎల్‌వి రమణ పోటీలను ప్రారంభించారు. ఈ జట్లు నెలాఖరున జరిగే జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో పోటీ పడనున్నాయి. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి తవుడుబాబు, కబ్బడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పతివాడ శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు సూర్యారావు, వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి భగవాన్‌దాస్ పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్

విజయనగరం టౌన్ : ఇటీవల నగరంలో మహిళ మెడలో బంగారం చోరీ చేసిన దొంగను రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. టూ టౌన్ సిఐ లక్ష్మణరావు కథనం ప్రకారం.. సోమవారం ఉదయం 9 గంటలకు పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఎఎస్ఐ వై.పైడి తల్లి, సిబ్బంది కలిసి అంబటి సత్రం జంక్షన్‌కు చేరుకున్నారు. మూడులాంతర్ల జంక్షన్ వైపు నుంచి స్కూటీపై వస్తున్న అశోక్‌నగర్‌కు చెందిన నరం లతీఫ్ పోలీస్ వాహనం చూసి వెనక్కి తిరిగి వెళ్లిపోవడానికి ప్రయత్నించాడు. వెంటనే పోలీసులు ఆయన్ను పట్టుకుని విచారించారు. కల్కి భగవాన్ టెంపుల్ దగ్గర చేసిన దొంగతనాన్ని లతీఫ్ అంగీకరించాడు. చోరీ చేసిన 1.8 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశారు. స్కూటీని సీజ్ చేసి, దొంగను రిమాండ్‌కు తరలించారు.

23న వాహనాల వేలం

ప్రజాశక్తి- బొబ్బిలి

వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 23న వేలం వేయనున్నట్లు ఎస్ఇబి సిఐ జైభీమ్ తెలిపారు. స్థానిక ఎస్ఇబి స్టేషన్‌లో వేలం నిర్వహిస్తున్నామని, ఎవరైనా వేలంలో పాల్గొనవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

IN THE HON'BLE COURT OF THE I ADDL. JUNIOR CIVIL JUDGE, AT : VISAKHAPATNAM
O.S. 361/2021

Between :
Rajasekhar Sistu & Another ...Plaintiffs
And
Smt. Kalyampudi Parwathi & 2 others ...Defendants

SUMMONS

To,
Defendant No.3 :
BALAGA POLINAIDU,
S/o.late B.Gowrinaidu,
R/at D.No.2-73, Peddaveedhi,
Dalayivalasa Village, Gurugibilli Mandal, Vizianagaram District.

Where the plaintiff herein above filed the aforesaid suit against you along with two others seeking for recovery of an amount Rs.4,00,000/- due under the suit's sale agreements and for other reliefs. Where it is found to the satisfaction of the Hon'ble Court that you have been evading receipt of summons in the above suit, consistently and the matter stands posted to **07-12-2022** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **07-12-2022** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

B. SRINIVASA RAO,
Advocate
Visakhapatnam,
Cell: 9494400239.

BOBBILI MUNICIPALITY
e.PROCUREMENT TENDER NOTICE

Roc.No.194/2019/E1. Dt.21.011.2022

S.No.	Nit No.	No. of works	Estimated cost
1	Roc.No.383/2022-23/E1/6, Dt.21.11.2022	6	Rs. 33.40 Lakhs

Bid Document Downloading Start Date : 22.11.2022 at 11.00 AM
Bid Document Downloading End Date : 29.11.2022 at 11.00 AM
Last Date & Time for receipt of Bids : 29.11.2022 at 03.00 PM
Technical Bid opening Date : 29.11.2022 at 04.00 PM

Note: Other details please read e.procurement market plan https://tender apeprocurement.gov.in

Commissioner,
Bobbili Municipality